7

సాక్షి మహబూబాబాద్

సోమవారం । 26 । మే । 2025



కాళేశ్వరానికి పెరిగిన భక్తులు..
సరస్వతీనది పుష్కరాలు ముగింపు సమీపి స్తుండడంతో భక్తులు పోటెత్తుతున్నారు. ఆదివారం సెలవు కావడంతో ఆర్టీసీకి భక్తు లు ఒక్కసారిగా పెరిగారు. - 8లో



మోదీ పాలన ప్రమాదకరం
మోదీపాలన ఈ దేశానికి అత్యంత ప్రమాద కరమని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సాధుల శ్రీనివాస్ అన్నారు. శిక్షణ తరగ తులకు హాజరై మాట్లాడారు. - 9లో

గరిష్టం/కనిష్టం 37.8^0/23.7^0

వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరం గా ఉంటుంది. మధ్యాహ్నం పలుచోట్ల చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.


నదిలో దీపాలు వదులుతున్న మహిళలు


ముక్తీశ్వరుడికి మొక్కుతున్న గవర్నర్ దంపతులు

సాధామిని.. పుష్కర మణి!

ప్రాణహితలో మునకలు.. పుష్కరిణికి పూజలు.. పారే గోదావరికి దీపదానాలు.. ప్రవహించే తల్లికి చీరసారెలు. పితృదేవతలకు పిండ ప్రదానాలు.. అందగా నిలవమని నదికి నవరత్న మాల హారతులు. చదువుల తల్లి నిలువెత్తు రూపానికి భక్తుల నీరాజనాలు. కాళేశ్వర ముక్తీశ్వరుడికి శత కోటి ప్రణామాలు. ఆదివారం కాళేశ్వరానికి భక్తులు పోటె త్తారు. సెలవు కావడంతో నదీ పరిసరాలు కిక్కిరిశాయి. కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించింది. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సినీ నటుడు తనికెళ్ల భరణి పుణ్యస్నానం ఆచరించి కాళేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

- వివరాలు, ఫొటోలు: 8లో


కాళేశ్వరం గోదావరి నది వద్ద భక్తుల కోలాహలం


నదికి మొక్కుతున్న భక్తురాలు

న్యూస్‌రీల్

ప్రశాంతంగా గ్రామ పాలన అధికారుల పరీక్ష



మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో ఆదివారం గ్రామ పాలన అధికారుల పరీక్ష ప్రశాంతంగా ముగిసి నట్లు కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అన్నారు. పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో గ్రామ పాలన అధికారుల పరీక్షకు 152 మంది అభ్యర్థు లకు 130 మంది అభ్యర్థులు హాజరై, 22 మంది గైర్హాజరయ్యారన్నారు. గతంలో రెవెన్యూశా ఖలో పనిచేసిన వీఆర్వోలు, వీఆర్‌ఏలు గ్రామ పాలన అధికారుల పరీక్ష రాశారన్నారు. పరీక్షకు సహకరించిన అన్ని శాఖ అధికారులు, జిల్లా పోలీస్ యంత్రాంగానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

నేడు లైసెన్స్‌డ్ సర్వేయర్లకు శిక్షణ

మహబూబాబాద్: జిల్లాలోని లైసెన్స్‌డ్ సర్వేయ ర్లకు నేడు(సోమవారం) మానుకోట పట్టణం అనంతారం రోడ్డులోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించను న్నట్లు ఎస్ఎల్ఆర్ ఏడీ నర్సింహమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభు త్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి చట్టాన్ని పక్కాగా అమలు చేసేందుకు సర్వేయర్లకు శిక్షణ ఇస్తున్నామన్నారు. జిల్లాలో 390మంది గుర్తింపు పొందిన సర్వేయర్లు ఉన్నా రన్నారు. 203 మందికి మొదటి విడతలో శిక్షణ ఇస్తున్నామన్నారు. ఉదయం 9నుంచి సాయం త్రం 5గంటల వరకు శిక్షణ నిర్వహించనున్నట్లు చెప్పారు.

టీజీఈసెట్‌లో సత్తాచాటిన మండలవాసి



చిన్నగూడూరు: తెలంగాణ ఈసెట్ విడుదల చేసిన పరీక్ష ఫలితాల్లో మండలవాసి రాష్ట్ర స్థాయి ర్యాంక్ సాధించింది. మండలంలోని జయ్యారం గ్రామానికి చెందిన తిప్పర్తి భాను ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగంలో ఈసెట్ రాష్ట్రస్థాయి ఫలితాల్లో 234వ ర్యాంకు సాధించింది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తేజోన్నత రెడ్డి, ఉపేందర్ సహకారంతో ర్యాంక్ సాధించినట్లు ఆమె తెలిపింది. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినిని గ్రామస్తులు, ఉపాధ్యా యులు అభినందించారు.

ఆర్ట్స్ కాలేజీ ప్లేస్‌మెంట్ సెల్ అధికారిగా జితేందర్

కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివ ర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ప్లేస్‌మెంట్ సెల్ అధికారిగా ఆ కళాశాల కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొ ఫెసర్ డాక్టర్ ఎల్.జితేందర్‌ను నియమిస్తూ ఆక ళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.జ్యోతి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈసంద ర్భంగా జ్యోతి మాట్లాడుతూ.. కళాశాలలో నిర్వ హిస్తున్న ఉపాధి కల్పన శిక్షణ కేంద్రం ద్వారా వివిధ పోటీ పరీక్షలకు విద్యార్థులకు శిక్షణ ఇప్పించడం, వివిధ కంపెనీల్లో ఉద్యోగ కల్పన చేపట్టేందుకు ఈప్లేస్‌మెంట్ సెల్ అధికారి విధు లు నిర్వర్తిస్తారన్నారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ రెహమాన్ నియామక ఉత్తర్వులను జితేందర్‌కు అందించి అభినందించారు.

కోటగుళ్లలో పూజలు

గణపురం: కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్లలో ఆదివారం స్టేట్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూ టర్ సత్యనారాయణస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చ కుడు జూలపల్లి నాగరాజు ఆయనను సాదరం గా ఆహ్వానించి గణపతి, నందీశ్వరుడు, గణపే శ్వరుడి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కోటగుళ్ల పరిరక్షణ సమితి ఆధ్వర్యం లో పూల మాలలు, శాలువాతో ఘనంగా సన్మా నించి, తీర్థ ప్రసాదాలు అందించారు. కోటగుళ్ల సందర్శన ప్రత్యేక అనుభూతిని ఇచ్చిందని, ఆలయ శిల్ప సంపద అద్భుతమని ఆనందం వ్యక్తం చేశారు.

పెండింగ్ బిల్లులకు మోక్షం



- మాజీ సర్పంచ్‌లకు ఊరట
- రూ 10.లక్షలలోపు బిల్లులకు క్లియరెన్స్
- 2024 ఆగస్టులోపు చేసిన పనులకే..

మహబూబాబాద్: గ్రామ పంచాయతీల్లో గతంలో చేసిన అభివృద్ధి పనుల బకాయి బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. గతంలో సర్పంచ్‌లు సొంత డబ్బులతో పనులు చేయించారు. కాగా మూడేళ్లుగా వాటి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ మేరకు వారు బిల్లులు విడుదల చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రూ.10లక్షల లోపు ఉన్న బిల్లులకు మాత్రమే నిధులు విడుదల చేయ గా.. మాజీ సర్పంచ్‌లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

482 జీపీలు..

జిల్లాలో 482 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఆయా జీపీల్లో 6,35,872 మంది జనాభా, 5,61,960 మంది ఓటర్లు, 1,75,551 గృహాలు ఉన్నాయి. సర్పంచ్‌ల పదవీకాలం 2024 జనవరి 31తో ముగిసింది. అప్పటి నుంచి ఎన్నికలు లేక పోవడంతో స్పెషల్ ఆఫీసర్ల పాలన కొనసాగుతోం ది. కాగా సర్పంచ్‌లో పదవిలో ఉన్నప్పుడు గ్రామా ల్లో చేపట్టిన పనులకు సంబంధించి బిల్లులు మూడే ళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో మాజీ సర్పంచ్ లు బిల్లుల కోసం ఆందోళనలు చేస్తున్నారు. ఈ నేప థ్యంలో రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న 9,990 బిల్లులను క్లియర్ చేస్తూ నిధులు విడుదల చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. జిల్లాలో 2024 ఆగస్టు లోపు చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి రూ.10లక్షలలోపు ఉన్న బిల్లులన్నీ క్లియర్ కాను న్నాయి.

సంబంధిత కార్యాలయాల చుట్టూ మాజీ సర్పంచ్‌లు..


ఇనుగుర్తి గ్రామపంచాయతీ కార్యాలయం

ప్రభుత్వం నిధులు విడుదల చేసినట్లు ప్రకటించ గానే మాజీ సర్పంచ్‌లు డీటీఓ కార్యాలయం, డీపీఓ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. డబ్బులు ఎప్పుడు జమ అవుతాయని అధికారులను అడుగు తున్నారు. అందుకు సంబంధిత అధికారులు తమకు ఎలాంటి ఉత్తర్వులు రాలేదని, పేపర్లలో మాత్రమే చూశామని చెబుతున్నారు. మాజీ సర్పం చ్‌ల ఖాతాల్లోనే డబ్బులు జమ అవుతాయని అధికారులు అంటున్నారు.

స్పెషల్ ఆఫీసర్ల పాలన..

సర్పంచ్‌ల పదవీకాలం ముగిసిన తర్వాత ఎన్నికలు నిర్వహించకపోవడంతో స్పెషల్ ఆఫీసర్ల పాలన కొనసాగుతోంది. ఎన్నికలు ఎప్పుడు వచ్చిన ని ర్వహించేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు. మాజీ సర్పంచ్‌ల నిధులు విడుదలతో జీపీ ఎన్నిక లు త్వరలోనే ఉంటాయనే సంకేతాలు కనిపిస్తున్నా యి. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, రాజీవ్ యువ వికాసం తదితర పథకాలను వేగవంతం చేసింది. జీపీ ఎన్నికల్లో లబ్ధి పొందాలనే ఆలోచన తో అధికార పార్టీ అభివృద్ధి పనులను వేగవంతం చేసినట్లు అర్థమవుతోంది.

మండలాల వారీగా పెండింగ్ బిల్లులు

మండలం	పెండింగ్ బిల్లుల డబ్బులు
బయ్యారం	14,842,354
చిన్నగూడూరు	51,358,84
దంతాలపల్లి	67,53,189
డోర్నకల్	84,61,548
గంగారం	63,233,68
గార్ల	99,716,85
గూడూరు	47,862,457
కేసముద్రం	23,763,998
కొత్తగూడ	26,215,657
కురవి	13,028,911
మానుకోట	27,499,764
మరిపెడ	18,006,391
నర్సింహులపేట	83,93,430
నెల్లికుదురు	23,171,816
పెద్ద వంగర	92,59,513
తొర్రూరు	86,32,184
మొత్తం	25,73,22,149

ఎలాంటి ఉత్తర్వులు రాలేదు

నిధుల విషయంలో ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. గతంలో జిల్లాలో పెండింగ్ బిల్లుల జాబితా పంపించాం. ఆ బిల్లులు అన్ని ఎస్టీఓ కార్యాలయంలోనే జరిగాయి. ప్రభు త్వం నుంచి ఆదేశాల వస్తే దాని ప్రకారం ప్రాసెస్ చేస్తాం.

- హరిప్రసాద్, డీపీఓ

వారి ఖాతాల్లో జమ అవుతాయి

అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు చేసి ప్రభుత్వానికి పంపాం. క్లియర్ చేసే బిల్లుల డబ్బులు మాజీ సర్పంచ్‌ల ఖాతాల్లోనే జమ అవుతాయి. వాటికి సంబంధించిన ప్రత్యేక జాబితా లేదు. ప్రభుత్వం నుంచి కూడా ఎలాంటి ఉత్తర్వులు రాలేదు.

- వి.సత్యనారాయణ, డీటీఓ

సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతం

- ఉదయం సెషన్‌లో 58.80శాతం..
- మధ్యాహ్నం సెషన్‌లో 58.49శాతం హాజరు

విద్యారణ్యపురి: యూపీఎస్సీ సివిల్ సర్వీస్ ప్రిలిమినరీ పరీక్ష-2025 ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. మొత్తం అభ్యర్థులు 4,141 మందికి గాను హనుమకొండ జిల్లాలో 10 పరీక్ష కేంద్రాలు కేటాయించారు. ఉదయం 9.30 నుంచి 11.30 గం టల వరకు మొదటి సెషన్‌లో 2,435 మం ది(58.80శాతం), మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 గంటల వరకు సెకండ్ సెషన్ పరీక్షకు 2,422మంది (58.49శాతం)మంది హాజరైనట్లు కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. ఎగ్జామ్ సెంటర్ల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. అభ్యర్థులకు సంబంధించి అడ్మిట్ కార్డుతోపాటు గుర్తింపు కార్డు పరిశీలించడం తోపాటు క్షుణ్ణంగా తనిఖీచేశాకే ఉదయం 9 గంటల వరకు లోనికి అనుమతించారు. హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్‌కాలేజీ, ప్రభుత్వ పింగిళి మహిళా కళాశాల కేంద్రాలను కలెక్టర్ ప్రావీణ్య పరిశీలించారు.


హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి మహిళా కళాశాల పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య


పరీక్ష కేంద్రం వద్ద అభ్యర్థులు


అభ్యర్థిని తనిఖీ చేస్తున్న పోలీసులు


పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న అభ్యర్థి

నేటితో ముగియనున్న సరస్వతి నది పుష్కరాలు

కాళేశ్వరం: ఈనెల 15నుంచి 26వరకు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న సరస్వతి నది పుష్కరాలు (నేడు) సోమవారంతో ముగియనున్నాయి. ముగిం పు కార్యక్రమాలను సాయంత్రం 6గంటల నుంచి నిర్వహించడానికి దేవాదాయశాఖ ఏర్పాట్లు చేస్తుం ది. సుమారు వందకుపైగా డ్రోన్ కెమెరాలతో చిత్రీకరణలు, భారీగా క్రాకర్స్ పేల్చి సంబురాలు జరపనున్నట్లు తెలిసింది. ఇప్పటికే అవతలి తీరం వైపునకు బోటులో జనరేటర్, ఇతర సామగ్రి తర లివెళ్లినట్లు తెలిసింది.

ఆర్టీసీలో ఔట్ సోర్సింగ్



- సిబ్బంది లోటు తీర్చేందుకు తాత్కాలిక చర్యలు
- వరంగల్ రీజియన్‌లో ఇప్పటికే 30 మంది డ్రైవర్ల నియామకం
- మరో 70 మంది డ్రైవర్లు, 100 మంది కండక్టర్ల అవసరం
- జీతం డ్రైవర్లకు నెలకు రూ.22వేలు, కండక్టర్లకు రూ.17,969

హన్మకొండ: టీజీఎస్ ఆర్టీసీలో ఔట్ సోర్సింగ్ నియామకాలు అమలులోకి వచ్చాయి. పూర్తి స్థాయి నియామకాలకు మంగళం పాడిన యాజమాన్యం సిబ్బంది లోటును పూడ్చడానికి తాత్కాలిక నియా మకాల వైపు మొగ్గు చూపింది. ఆర్టీసీలో త్వరలో ఉద్యోగాల నియామకం చేపట్టనున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వి.సి.సజ్జనార్ పలు మార్లు ప్రకటనలు చేశారు. ఆఫీసర్ స్థాయి ఉద్యోగాలు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా.. డ్రైవర్, కండక్టర్ల ఉద్యోగాలు పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా చేపట్టనున్నట్లు ప్రచారం జరిగింది. అందుకు భిన్నంగా యాజమాన్యం ఔట్ సోర్సింగ్ ని యా మ కాల కోసం జారీ చేసిన సర్క్యులర్ రీజియన్ కార్యా లయాలకు చేరింది. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. డ్రైవర్ల నియామక సర్క్యు లర్ ముందుగా, కండక్టర్లకు సంబంధించి తర్వాత జారీ అయ్యాయి. వరంగల్ రీజియన్‌లో ఇప్పటికే 30 మంది డ్రైవర్లను ఔట్ సోర్సింగ్ పద్ధతిలో నియా మకాలు చేపట్టి శిక్షణ ఇస్తున్నట్లు వరంగల్ ఆర్ఎం డి.విజయభాను తెలిపారు. మరో 70 మంది డ్రైవ ర్లను తీసుకునేందుకు సన్నద్ధం అవుతున్నారు.

ఎలక్ట్రిక్ బస్సుల రాకతో కండక్టర్ల కొరత..

అలాగే.. వరంగల్ రీజియన్‌కు ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం 112 ఎలక్ట్రిక్ బస్సులను కేటాయిం చింది. ఈ క్రమంలో కండక్టర్ల లోటు భారీగా ఏర్ప డింది. దీనికి తోడు రీజియన్‌లో ఆర్టీసీకి చెందిన సొంత బస్సులు 417 మాత్రమే ఉండగా.. అద్దె బస్సులు 310 ఉన్నాయి. ఎలక్ట్రిక్ బస్సులను ప్రయి వేట్ సంస్థ జేబీఎం ఆపరేట్ చేస్తున్నది. జేబీఎం ఎల క్ట్రిక్ బస్సులు, అద్దె బస్సులు కలిపి 422 ఉన్నాయి. ఆర్టీసీ సొంత బస్సుల్లో కండక్టర్ల కొరతను అధిగమి ంచేందుకు డ్రైవర్లకు టిమ్‌లు ఇచ్చి టికెట్ జారీ చేయిస్తూ బస్సులను నడుపుతోంది. ప్రైవేట్ బస్సుల డ్రైవర్లకు టికెట్ జారీ చేసేందుకు టిమ్‌లు ఇవ్వలేదు. అయితే.. కండక్టర్ల కొరత నేపథ్యంలో ఎలక్ట్రిక్ బస్సు డ్రైవర్లకు మాత్రం టిమ్‌లు ఇచ్చి టికెట్లు జారీ చేయిస్తున్నారు. ఆర్టీసీకి ప్రధాన ఆదాయం టికెట్ల ద్వారానే వస్తుంది కాబట్టి.. ప్రైవేట్ డ్రైవర్లకు అప్పగించేందుకు సిద్ధంగా లేని యాజమాన్యం తాత్కాలికంగా ఔట్ సోర్సింగ్ విధా నంలో కండక్టర్ల నియామకానికి నిర్ణయం తీసుకుం ది. ఈ క్రమంలో వరంగల్ రీజియన్‌కు అత్యవస రంగా 100 మంది కండక్టర్లను నియమించనున్నా రని, అవసరాన్ని బట్టి మరికొంత మందిని నియ మించే ఆలోచన ఉన్నట్లు అధికారులు తెలిపారు. రెగ్యులర్ నియామకాలకు ఆలస్యం అవుతుండడం తో తాత్కాలికంగా సమస్య నుంచి గట్టెందుకు ఔట్ సోర్సింగ్ వైపు ఆర్టీసీ మళ్లిందని, తర్వాత రెగ్యులర్ నియామకాలు చేపట్టే అవకాశముందని పలువురు అధికారులు పేర్కొంటున్నారు. అయితే ఔట్ సోర్సింగ్‌లో విజయవంతమైతే పూర్తి స్థాయి నియా మకాలను పట్టించుకుంటారా లేదా అనే సందే హాలు ఆర్టీసీ ఉద్యోగ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి.

మ్యాన్ పవర్ అందించే ఏజెన్సీల ద్వారా..

ఔట్ సోర్సింగ్ నియామకాలు మ్యాన్ పవర్ అందిం చే ఏజెన్సీల ద్వారా చేపట్టనున్నారు. ఆర్టీసీకి చెం దిన డిప్యూటీ రీజినల్ మేనేజర్లతో కూడిన కమిటీ డ్రైవర్ల నియామకాన్ని చేపడుతోంది. డ్రైవర్ ఉద్యో గానికి చదవడం, రాయడం వస్తే సరిపోతుంది. హెవీ డ్రైవింగ్ లైసెన్స్‌తోపాటు 18 నెలల అను భవం ఉండాలి. వయసు 60 ఏళ్ల లోపు వారు అర్హు లు. ఎంపిక కమిటీ ముందుగా డ్రైవింగ్ లైసెన్స్, అనుభవాన్ని పరిశీలించిన తర్వాత డ్రైవింగ్ టెస్ట్ నిర్వహిస్తారు. ఇందులో సంతృప్తి చెందిన అధికారు లు వారిని ఎంపిక చేస్తారు. ఆ తర్వాత మెడికల్ టెస్ట్ నిర్వహించి ఫిట్‌నెస్ కలిగి ఉన్న వారిని ఎంపిక చేసి 15 రోజులు ట్రైనింగ్ ఇచ్చి విధుల్లోకి తీసుకుం టారు. అదే విధంగా కండక్టర్ల నియామకాన్ని ఎం పిక కమిటీ చేపడుతుంది. ఎస్సెస్సీ తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై, వయసు 21 నుంచి 35 ఏళ్ల మధ్య ఉన్న వారు అర్హులు. వీరి నియామకానికి మ్యాన్ పవర్ అందించే ఏజెన్సీ రూ.2లక్షలు సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుంది. డ్రైవర్లకు నెలకు రూ.22 వేల జీతం ఇవ్వనుండగా, కండక్టర్లకు రూ.17,969 వేతనం చెల్లిస్తారు. ఎంపికైన వారు రవాణా శాఖ ద్వారా కండక్టర్ లైసెన్స్ పొందాలి.

పునఃప్రారంభమయ్యేనా?

- గతంలో నాలుగు ఎస్సీ హాస్టళ్లు మూత
- మళ్లీ ప్రారంభిస్తే విద్యార్థులకు ఎంతో మేలు
- అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి

మహబూబాబాద్ అర్బన్: పేద విద్యార్థులకు వసతి కల్పించేందుకు ఏర్పాటు చేసిన ఎస్సీ హాస్టళ్లు మూతపడ్డాయి. గతంలో విద్యార్థులు లేరనే సాకు తో బంద్ చేశారు. దీంతో విద్యార్థులకు ఇబ్బందు లు తప్పడం లేదు. జిల్లా కేంద్రంలోని ఎస్సీ ఆనంద నిలయం హాస్టల్, బాలికల(బి) హాస్టల్‌ను అధికారులు మూసివేశారు. అలాగే కొత్తగూడ ఆశ్రమ ఎస్సీ హాస్టల్, ఇనుగుర్తి ఎస్సీ హాస్టల్‌ను గత ఏడాది మూసివేశారు. పునఃప్రారంభించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యార్థిసంఘాల నాయకులు, మేధావులు కోరుతున్నారు.

హాస్టళ్లను కాపాడాలి..

జిల్లా వ్యాప్తంగా గతంలో 23 హాస్టళ్లు ఉండేవి.


మూతపడిన ఎస్సీ హాస్టల్

ప్రస్తుతం 19 హాస్టళ్లలో 1,400 మంది విద్యార్థులు ఉన్నారు. జూనియర్ కాలేజీలకు సంబంధించి నాలుగు హాస్టళ్లు ఉండగా 300 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇప్పటికే కొత్తగూడ, ఇనుగుర్తి మండలాల్లోని హాస్టళ్లు క్లోజ్ చేయగా.. మరో రెం డు హాస్టళ్లు మూతపడే ప్రమాదం ఉంది. మంత్రి సీతక్కకు కొత్తగూడ హాస్టల్‌ను ప్రారంభించాలని అక్కడి విద్యార్థుల తల్లిదండ్రులు, దళిత నాయకు లు వినతిపత్రం అందజేశారు. ఇనుగుర్తి మండలం ఏర్పడిన నేపథ్యంలో అక్కడి ఎస్సీ హాస్టల్ పునఃప్రా రంభిస్తే విద్యార్థులకు ఉపయుక్తంగా ఉంటుందని నాయకులు కోరుతున్నారు. దీనిపై జిల్లా ఎస్సీ షెడ్యూల్డ్ కులాల అధికారి ఎం.నరసింహ స్వామిని వివరణ కోరగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఎస్సీ హాస్టళ్ల పునఃప్రారంభానికి చర్యలు తీసుకుంటామ న్నారు. కాగా జిల్లాలో మూతపడిన నాలుగు హాస్ట ళ్లను పునఃప్రారంభించేందుకు అధికారులు, నాయ కులు చొరవ చూపాలని పలువురు కోరుతున్నారు.

ఆ భవనం నిరుపయోగం

ప్రత్యేక తెలంగాణలో 2016లో మహబూబాబాద్ జిల్లా ఏర్పాటైన తర్వాత ఎస్సీ ఆనంద నిలయం హాస్టల్, బాలికల(బి) హాస్టల్‌ను మూసివేసి, ఆ భవనాన్ని జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ కార్యాలయా నికి అప్పగించారు. కలెక్టరేట్ ప్రారంభం తర్వాత ఎస్సీ సంక్షేమ కార్యాలయం అక్కడికి మార్చారు. దీంతో ప్రస్తుతం ఆనంద నిలయం ఎస్సీ హాస్టల్ భవనం నిరుపయోగంగా ఉంది.

మా పిల్లలకు హాస్టల్ సౌకర్యం కల్పించాలి



మా గ్రామానికి అందుబాటులో ఉన్న మానుకోటలోని ఎస్సీ హాస్టల్‌ను పునఃప్రారంభిస్తే మా పిల్లలకు ఎంతగానో ఉపయోగ పడుతుంది. అక్కడ హాస్టల్ లేక పోవడంతో మా పిల్లలతో పాటు మా అన్నయ కొడుకును మా ఊరి దగ్గరలో ఉన్న బడికి పంపిం చాల్సిన పరిస్థితి ఏర్పడింది. సార్లు హాస్టల్ తెరిస్తే మా పిల్లలకు ఎంతో ఉపయోగపడుతుంది.

- తోట దివ్య, అమనగల్

అందుబాటులో హాస్టల్ లేకపోవడంతో అడ్మిషన్లు జరగడం లేదు



గత ఏడాది హాస్టల్ సౌకర్యం లేకపోవ డంతో చాలామంది ఎస్సీ విద్యార్థులు మా పాఠశాలలో అడ్మిషన్లు తీసుకోవడా నికి నిరాకరించారు. పాఠశాలకు అందు బాటులో బాలబాలికలకు హాస్టళ్లు ఉం టే విద్యార్థులు మా పాఠశాలలో అడ్మిషన్లు పొందుతారు. శాఖ ఉన్నతాధికారులు స్పందించి హాస్టళ్లను పునఃప్రాంభిం చాలి.

- కోట్యానాయక్, కంకరబోర్డు పాఠశాల హెచ్ఎం, మానుకోట

విద్యార్థులపై చిన్నచూపు



ప్రభుత్వం ఎస్సీ విద్యా ర్థులు, ఎస్సీ హాస్టళ్లపై చిన్నచూపు చూస్తోంది. ఈ విద్యా సంవత్సరం జిల్లాలో మూతపడ్డ నాలుగు ఎస్సీ హాస్టళ్లను ప్రభుత్వం, ఉన్న తాధికారులు స్పందించి పునఃప్రారంభిం చాలి. దీంతో విద్యార్థులకు మేలు కలుగు తుంది.

- పొన్నాల యుగంధర్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు

వైభవంగా సోమేశ్వరస్వామి మాస కల్యాణం

పాలకుర్తి టౌన్: శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో మాస శివరాత్రి సందర్భంగా చండిక అమ్మవారి ఆలయంలో ఆదివారం చండికాసమేత సోమేశ్వర స్వామివారికి మాస కల్యాణం మేళతాళాలు, అర్చకుల వేద మంత్రోచ్ఛరణల మధ్య వైభవంగా జరిగింది. భక్తులు కల్యాణోత్స వంలో పాల్గొని కనులారా తిలకించి తరించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ సల్వాది మోహన్ బాబు, అర్చకులు దేవగిరి లక్ష్మన్న, డీవీఆర్‌శర్మ, దేవగిరి అనిల్‌కుమార్, మత్తగజం నాగరాజు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఒకే దేశం.. ఒకే ఎన్నికతోనే సుస్థిర పాలన

మహబూబాబాద్ అర్బన్ : ఒకే దేశం-ఒకే ఎన్నిక విధానంతో సుస్థిరపాలన అందించవచ్చని బీజేపీ రాష్ట్ర కోకన్వీనర్ శ్రీరామ్ అన్నారు. జిల్లా కేంద్రం లోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం కార్యకర్త లు, నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించా రు ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ.. ఒకే దేశం ఒకే ఎన్నిక విధానంతో దేశంలో అన్ని ఎన్నిక లు ఒకేసారి 100రోజుల్లోపు జరుగుతాయని, తద్వా రా ప్రజాపాలన సులభం అవుతుందని, దేశ సంప ద, అధికార యంత్రాంగం శ్రమ వృథా కాదన్నారు. దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి సాధిస్తుందన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్య వర్గ సభ్యులు రామచంద్రరావు, వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ మహేశ్‌గౌడ్, కోకన్వీనర్ సం దీప్‌గౌడ్, పార్లమెంట్ కో కన్వీనర్ సతీష్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు అశోక్, గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి రాంబాబు నాయక్ ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరామ్



నవరత్నమాల హారతి ఇస్తున్న కాశీ పండితులు



పుష్కర స్నానం ఆచరిస్తున్న భక్తులు

త్రివేణి సంగమం.. జనసంద్రం

పుష్కర స్నానాలకు పోటెత్తిన భక్తజనం

- ఉదయం నుంచి రాత్రి వరకు కొనసాగిన రద్దీ
- 11వ రోజు రెండు లక్షల మంది వరకు రాక
- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దంపతులు, యోగానందాసరస్వతిస్వామి, సినీనటుడు తనికెళ్ల భరణి పుష్కర స్నానాలు, పూజలు
- కాశీపండితులతో నవరత్నమాల హారతి

భూపాలపల్లి/కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో ఈనెల 15 నుంచి అంగరంగ వైభవంగా జరుగుతున్న సరస్వతీనది పుష్కరాలు పదకొండు రోజుకు చేరుకున్నాయి. ఆదివారం సెలవుదినం సందర్భంగా తెలంగాణతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు కాళేశ్వరానికి భారీగా తరలి వచ్చారు. గోదావరి, ప్రాణహిత, అంతర్వాహిని సరస్వతీనదిలో పుష్కర స్నానాలు ఆచరించి, నదీ మాతకు పూజలు చేశారు. పిండప్రదాన పూజలు చేశారు. నదీమాతకు చీర, సారె సమర్పించారు. దంపతిస్నానాలు చేసి దొప్పల్లో దీపాలు వదిలి మొక్కులు చెల్లించారు. ఘాటుపై ఏర్పాటు చేసిన 17 అడుగుల సరస్వతీమాత విగ్రహాన్ని దర్శించుకున్నారు. అనంతరం శ్రీకాళేశ్వరముక్తీశ్వరుడిని దర్శించుకున్నారు. క్యూలైన్‌లో బారులుదీరడంతో రాత్రి వరకు ఆలయంలో రద్దీ నెలకొంది.

రెండు లక్షల మంది భక్తుల రాక..

వివిధ రాష్ట్రాల నుంచి ఆర్టీసీ, ప్రైవేట్ వాహనాల్లో భక్తులు త్రివేణి సంగమం సరస్వతీనదికి వచ్చి పుష్కర స్నానాలు ఆచరించారు. సోమవారంతో పుష్కరాలు ముగియనుండడంతో భక్తులు ఆదివారం భారీగా కాళేశ్వరం బాటపట్టారు. రెండు లక్షల మంది భక్తులు పుష్కరిణిలో పుణ్యస్నానాలు చేసి స్వామివారిని దర్శించుకున్నట్లు అధికారులు అంచనా.

ట్రాఫిక్ జామ్..

కాళేశ్వరానికి భక్తులు ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాల్లో తరలిరావడంతో పోలీసులు అన్నారం క్రాస్ నుంచి వయా మద్దులపల్లి మీదుగా వన్ వే ఏర్పాటు చేసి వాహనాలు తరలించారు. మంచిర్యాల వైపు నుంచి వచ్చేవాహనాలు అంతర్రాష్ట్ర వంతెన వద్ద నుంచి ట్రాఫిక్ జామ్ కొనసాగింది. ప్రాణహిత వంతెన వరకు ట్రాఫిక్ జామ్ అయ్యింది. భక్తులు పార్కింగ్ స్థలాల నుంచి కాలినడకన ఘాట్ వరకు నడిచివెళ్లారు. మహదేవపూర్ నుంచి వచ్చే వాహనాలు మధ్యాహ్నం నుంచి వన్‌వే తీయడంతో టూ వే ద్వారా మళ్లీ తరలివచ్చాయి. కలెక్టర రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరే ట్రాఫిక్‌ను సమీక్షించారు.



తాత్కాలిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద బస్సుకోసం ఎదురుచూస్తున్న భక్తులు

ఆర్టీసీ బస్సులు లేక అవస్థలు..

భక్తులు తిరుగు ప్రయాణంలో బస్సులు సరిపడా లేక ఇబ్బందులు పడ్డారు. ఆర్టీసీ సాయంత్రం వేళల్లో బస్సులు అధిక సంఖ్యలో నడిపించడం లేదని భక్తులు ఆరోపించారు.

పోలీసుల అత్యుత్సాహం..

రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ పుష్కరాల పర్యటన సందర్భంగా పోలీసులు భద్రత కట్టుదిట్టం చేశారు. ఇందులో భాగంగా ఐడీకార్డులు ఉన్న వారి ద్విచక్ర వాహనాలనూ అనుమంతించలేదు. అలాగే, మీడియా ప్రతినిధులతోనూ వాగ్వాదానికి దిగారు. ప్రధాన ఆలయం మండపంలోకి వెళ్లే గేటు వద్ద ఎస్సై ఎస్.రాజేశ్.. ఉత్సవ కమిటి సభ్యుడు అశోక్‌తో వాగ్వాదానికి దిగారు. దీంతో అక్కడున్న వారు సముదాయించే ప్రయత్నంలో అన్న సంబోధించగా ఎస్సై కోపోద్రేకుడయ్యాడు. తాను సబ్ ఇన్‌స్పెక్టర్‌ను అని, తనను సార్ అని సంబోంధించాలని ఆగ్రహం వ్యక్తం చేశాడు. దీంతో ఎస్సైపై సీఐకి ఫిర్యాదు చేసినా ఫలితం లేదు.

ఘనంగా హారతి..

సరస్వతిఘాట్ వద్ద ఆదివారం రాత్రి కాశీపండితులతో నవరత్నమాల హారతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఏడుగురు పండితుల బృందం తొమ్మిది హారతులను ప్రత్యేకంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. 45 నిమిషాల పాటు జరిగే హారతి కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నారు. మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సీతక్క, దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యార్, కమిషనర్ వెంకట్‌రావు, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ , భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, సీఎంఓ కార్యదర్శి శ్రీనివాస రాజు, కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరే, ఈఓ మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖుల పుష్కర స్నానం

కాటారం/కాళేశ్వరం: కాళేశ్వరంలో కొనసాగుతున్న సరస్వతీ నది పుష్కరాల్లో భాగంగా ఆదివారం రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మతో పాటు రాష్ట్ర మంత్రి సీతక్క, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, యోగానంద సరస్వతి స్వామి, ఎమ్మెల్సీ సురభివాణి, మహారాష్ట్రలోని గడ్చిరోలి ఎంపీ నాందేవ్ కిర్సాన పుణ్యస్నానం ఆచరించారు. అలాగే, దేవాదాయ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ శైలజారామయ్యార్ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కాగా, హెలికాప్టర్ ద్వారా కాళేశ్వరం చేరుకున్న గవర్నర్‌కు రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు, కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరే స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేశారు. పూజల అనంతరం ఆలయ అర్చకులు గవర్నర్ దంపతులకు వేదాశీర్వచనం చేశారు.



నదిలో దీపం వదులుతున్న భక్తురాలు



నదిలో పూజలు చేస్తున్న భక్తులు



నదిలో పుష్కర స్నానం చేయిస్తున్న అర్చకుడు



శివుడి ప్రతిమ వద్ద ఫొటోలు దిగుతున్న భక్తులు



పుష్కరిణికి నమస్కరిస్తున్న భక్తులు



సరస్వతి ఘాట్ నుంచి ఆలయానికి కాలినడకన వస్తున్న భక్తజనం



గవర్నర్ దంపతులకు జ్ఞాపిక అందజేస్తున్న మంత్రి శ్రీధర్ బాబు, కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ



నదిలో దీపాలు వదులుతున్న భక్తులు

మంద కృష్ణ మాదిగకు ఘన స్వాగతం పలుకుదాం



మాట్లాడుతున్న వై.కె. విశ్వనాథ్

హన్మకొండ: ఈనెల 27న ఢిల్లీలో రాష్ట్రపతి చేతుల మీదుగా పద్మశ్రీ పురస్కారం అందుకుని 31న వరంగల్‌కు రానున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగకు ఘన స్వాగతం పలుకుదామని మహాజన సోషలిస్ట్ పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు వై.కె.విశ్వనాథ్, ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేశ్ పిలుపునిచ్చారు. ఆదివారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జాతీయ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగు సురేశ్, ఎంఎస్పీ జాతీయ నాయకుడు మంద కుమార్, నాయకులు ఎస్.నరేంద్రబాబు, మంద వెంకటేశ్వరరావు, బొడ్డు దయాకర్, బొర్ర భిక్షపతి, బుర్ర సతీశ్, పుట్ట రవి, పేరెల్లి ఎలీషా, దుడ్డు రామకృష్ణ, చేతల శివ, మంద వర్ధన్, కుమ్మరి శ్రీనాథ్, దావు ఆదిత్య పాల్గొన్నారు.



పుష్కరాలకు వెళ్తూ...తిరిగిరాని లోకాలకు

- కారు, తవేరా ఢీ.. వృద్ధురాలి దుర్మరణం
- కాటారం ఫారెస్ట్ చెక్‌పోస్ట్ వద్ద ఘటన



లలిత మృతదేహం

కాటారం : పుష్కరాలకు వెళ్తూ ఓ వృద్ధురాలు తిరిగిరాని లోకాలకు చేరింది. కారు, తవేరా ఢీకొన్న ప్రమాదంలో దుర్మరణం చెందింది. ఈ ఘటన జయశంకర్‌భూపాలపల్లి జిల్లా కాటారం మండలం నస్తూర్‌పల్లి వద్ద జాతీయ రహదారి 353(సి)పై చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం హైదరాబాద్‌కు చెందిన సకోటి కిషన్‌లాల్, కడికె దుర్గాజీ కుటుంబ సభ్యులు, డ్రైవర్ మహేందర్ తవేరాలో పుష్కరాలకు బయలుదేరారు. సూర్యాపేట జిల్లా నేరేడుచర్లకు చెందిన లక్ష్మీనర్సింహారావు కుటుంబ సభ్యులు కాళేశ్వరంలో పుష్కర స్నానం ఆచరించి కారులో తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో కాటారం మండల కేంద్రానికి సమీపంలోకి రాగానే జాతీయ రహదారిపై కారు ముందు వెళ్తున్న మరో వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోయి ఎదురుగా వస్తున్న తవేరాను ఢీకొంది. దీంతో వాహనాలు నుజ్జునుజ్జయి రోడ్డుకు ఇరువైపులా దూసుకుపోయాయి. ఈ ఘటనలో తవేరాలో ప్రయాణిస్తున్న డ్రైవర్, పదిమంది భక్తులు, కారులో ప్రయాణిస్తున్న ఐదుగురు భక్తులు వాహనాల్లోనే ఇరుక్కుపోయారు. అటువైపుగా వెళ్తున్న వాహనదారులలతో పాటు సమీపంలో అన్నదానం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు జేసీబీ సాయంతో వాహనాల డోర్లు తెరిచి క్షతగాత్రులను బయటకు తీశారు. తవేరాలో ప్రయాణిస్తున్న హైదరాబాద్‌కు చెందిన సకోటి లలిత(61) తీవ్రంగా గాయపడడంతో చికిత్స నిమిత్తం భూపాలపల్లి ఆస్పత్రికి తరస్తున్న క్రమంలో మార్గమధ్యలో మృతి చెందింది. అదే వాహనంలోని డ్రైవర్‌తో పాటు మరో తొమ్మిది మందికి గాయాలుకావడంతో హనుమకొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కారులో ప్రయాణిస్తున్న ఓనర్ కమ్ డ్రైవర్ లక్ష్మీనర్సింహారావుతో పాటు మరో నలుగురికి గాయాలయ్యాయి. ఘటనా స్థలిని ఎస్సై మ్యాక అభినవ్, పీఎస్సై గీతారాథోడ్ పరిశీలించి వివరాలు సేకరించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

పుష్కరాల్లో తనికెళ్ల భరణి ప్రవచనాలు



ప్రవచనాలు చెబుతున్న తనికెళ్ల భరణి

కాటారం: కాళేశ్వరంలో కొనసాగుతున్న సరస్వతీనది పుష్కరాల్లో ఆదివారం సినీనటుడు తనికెళ్ల భరణి పాల్గొన్నారు. సరస్వతి(వీఐపీ)ఘాట్ వద్ద త్రివేణి సంగమంలో పుష్కర స్నానం ఆచరించిన అనంతరం కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకొని అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సరస్వతి ఘాట్ వద్ద సంగీత్ నాటక్ అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా స్వామి వారి ప్రవచనాలు చెప్పారు. కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ప్రాముఖ్యత, త్రివేణి సంగమం, సరస్వతీనది పుష్కరాల గొప్పతనం గురించి వివరించారు.

రైలు ఢీకొని ట్రాన్స్‌జెండర్ దుర్మరణం

ఖిలా వరంగల్: పట్టాలు దాటుతున్న క్రమంలో గుర్తుతెలియని రైలు ఢీకొనడంతో ఓ ట్రాన్స్‌జెండర్ మృతి చెందింది. ఈఘటన ఆదివారం వరంగల్ చింతల్ ఫ్లైఓవర్ అబ్బనికుంట మైసమ్మ దేవాలయం వద్ద చోటు చేసుకుంది. జీఆర్‌పీ పోలీసుల కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం బొల్లెపల్లి గ్రామం వడ్డెర కాలనీకి చెందిన ట్రాన్స్‌జెండర్ మిరియాల ఐశ్వర్య (35) వ్యక్తిగత పని నిమిత్తం చింతల్‌కు వచ్చింది. అనంతరం మైసమ్మ ఆలయ సమీపాన పట్టాలు దాటి వరంగల్ వైపు వెళ్తున్న క్రమంలో గుర్తుతెలియని రైలు ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108లో ఎంజీఎం తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్ గాంధీకి తరలించగా చికిత్స పొందుతూ అదే రోజు సాయంత్రం మృతి చెందింది. వరంగల్ రైల్వే జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ రాజు శవ పంచనామ నిర్వహించిన అనంతరం మృతురాలి తల్లి బొందమ్మకు ఐశ్వర్య మృతదేహం అప్పగించారు.



ఐశ్వర్య (ఫైల్)

కాళేశ్వరానికి పెరిగిన భక్తులు



కిక్కిరిసిన భక్తులతో ఆర్టీసీ హనుమకొండ జిల్లా బస్ స్టేషన్

- బస్సులు సమకూర్చిన అధికారులు
- నేడు భక్తుల రద్దీ పెరిగే అవకాశం

హన్మకొండ: సరస్వతీనది పుష్కరాలు ముగింపు సమీపిస్తుండడంతో భక్తులు పోటెత్తుతున్నారు. ఈ నెల 26తో పుష్కరాలు ముగియనున్నాయి. ఈ క్రమంలో ఆదివారం సెలవు దినం కావడంతో ఆర్టీసీకి భక్తులు ఒక్కసారిగా పెరిగారు. ఉదయం హనుమకొండ జిల్లా బస్ స్టేషన్‌తో పాటు వరంగల్ రీజియన్‌లోని ఇతర బస్ స్టేషన్లు భక్తుల రాకతో కిక్కిరిసిపోయాయి.అధికారులు అప్పటికప్పుడు బస్సులు సమకూర్చి భక్తులను చేరవేశారు. సోమవారం కూడా భక్తుల రద్దీ పెరిగే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. ఈ మేరకు సన్నద్ధమయ్యారు. ఈ నెల 15 నుంచి 24 వరకు 5574 ట్రిప్పుల ద్వారా 3,30,218 భక్తులను చేరవేశారు. వివిధ బస్ స్టేషన్ల నుంచి కాళేశ్వరానికి 3,347 ట్రిప్పుల ద్వారా 1,70,523 మందిని చేరవేయగా, తిరుగు ప్రయాణంలో కాళేశ్వరం నుంచి వివిధ బస్ స్టేషన్లకు 2,227 ట్రిప్పుల ద్వారా 1,59,695 మంది భక్తులను చేరవేశారు.

సరస్వతి పుష్కరాలకు తరలిన భక్తుల సంఖ్య

తేదీ	కాళేశ్వరం వెళ్లిన భక్తులు		తిరుగు ప్రయాణమైన భక్తులు	
	ట్రిప్పులు	భక్తులు	ట్రిప్పులు	భక్తులు
15న	123	4,198	117	3,287
16న	238	10,002	219	8,805
17న	259	12,324	240	9,869
18న	376	18,838	367	18,608
19న	310	15,152	307	14,474
20న	266	11,235	257	10,847
21న	374	19,028	359	17,996
22న	362	19,450	361	17,773
23న	445	24,786	434	24,971
24న	594	35,510	565	33,065

భక్తులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలి



భక్తులు, ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి క్షేమంగా గమ్య స్థానాలకు చేరుకోవాలి. మహాలక్ష్మి పథకంలో భాగంగా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నాం. ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

– డి.విజయభాను ఆర్టీసీ ఆర్‌ఎం, వరంగల్

బొగతకు జలకళ..



జలపాతం వద్ద జాలువారుతున్న నీటిధారలు

వాజేడు : మండల పరిధిలోని చీకుపల్లి సమీపంలో ఉన్న బొగత జలపాతం కళకళలాడుతోంది. మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గుట్టలపై నున్న వాగు ప్రవహించడంతో ఆ నీరు బొగతకు వచ్చి చేరుతుంది. దీంతో జలపాతం వద్ద నీటిధారలు జాలువారుతూ కనువిందు చేస్తున్నాయి. ఆదివారం జలపాతం వద్ద పర్యాటకులు సందడి చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

- ఘన్‌పూర్ శివారులో ఘటన



సురేశ్ (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్ : రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ప్రమాదం ఘన్‌పూర్ శివారు ఆర్‌ఆర్ దాబా సమీపంలో చోటు చేసుకుంది. ఈ ఘటన శనివారం అర్ధరాత్రి తర్వాత జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని శివునిపల్లికి చెందిన యాల వెంకటేష్, సురేశ్(21) తండ్రి నాగరాజు మూడేళ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందగా వారు ప్రస్తుతం సికింద్రాబాద్‌లోని వారాసిగూడలో నివాసం ఉంటున్నారు. వెంకటేష్, సురేశ్ డ్రైవర్లుగా పనిచేస్తూ తల్లితో కలిసి ఉంటున్నారు. సురేశ్ బైక్‌పై శివునిపల్లికి వస్తున్నాడు. ఈ క్రమంలో బైక్ ఘన్‌పూర్ శివారులో అదుపుతప్పి జాతీయ రహదారి పక్కన ఉన్న ఐరన్ సైడ్ బర్మ్‌కు ఢీకొనడంతో రోడ్డుపై ఎగిరిపడి అక్కడికక్కడే మృతిచెందాడు. అటుగా వెళ్తున్న బాటసారుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. ఈ ఘటనపై మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జి.వేణు తెలిపారు.

చౌళ్లపెల్లిలో వ్యక్తి..



రాచర్ల రవి(ఫైల్)

ఆత్మకూరు: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని చౌళ్లపెల్లి క్రాస్ సమీపంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం చౌళ్లపెల్లికి చెందిన రాచర్ల రవి(53) ఆదివారం రాత్రి పిల్లలను బస్ ఎక్కించడానికి బైక్‌పై ఆత్మకూరు వచ్చాడు. తిరిగి గ్రామానికి వెళ్తుండగా చౌళ్లపెల్లి క్రాస్ సమీపంలో గేదె ఎదురురావడంతో బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడింది. దీంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

జీవీబాబు ఇక లేరు..

చికిత్స పొందుతూ బలగం నటుడి కన్నుమూత

- మూగబోయిన ఓరుగల్లు రంగస్థలం
- 50కి పైగా పౌరాణిక పాత్రల్లో.. 20కి పైగా సినిమాల్లో నటన
- వరంగల్ పాపయ్యపేటలో విషాదం



భార్య సుజాతతో జీవీబాబు (ఫైల్)

హన్మకొండ కల్చరల్: ఓరుగల్లు ముద్దుబిడ్డ, ప్రముఖ రంగ స్థల కళాకారుడు జీవీబాబు (70) ఇకలేరు. బలగంతోపాటు 20 సినిమాలకు పైగా నటించిన మహా నటుడు జీవీ బాబు కన్నుమూశారు. రెండు కిడ్నీలు పాడై కొంత కాలంగా డయాలసిస్‌తో బాధపడుతున్నారు. వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందతూ ఆదివారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. దీంతో వరంగల్ రామన్నపేట(పాపయ్యపేట)లో విషాదఛాయలు అలుముకున్నాయి.

నాటక ప్రదర్శనలతో చైతన్యం..

సినిమాలకు అంతగా ప్రాధాన్యం లేని సమయంలో బాల్య వివాహాలు, వితంతు వివాహాలు, కన్యాశుల్కం వంటి సాంఘిక, సామాజిక సమస్యలను ఎత్తి చూపి వాటిని పారద్రోలేందుకు ప్రజల్లో చైతన్యం తీసుకురావడం కోసం అనేక నాటకాలు రచించి నాటకాలు వేసి అగ్ర స్థానంలో నిలిపారు. పౌరాణిక నాటకాలు వేసి ప్రేక్షకులను మెప్పిస్తూ ఆటపాటతో ఉర్రూతలు ఊగించారు.

నటనలో ఆయనకు సాటేరి..

వరంగల్ రామన్నపేట(పాపయ్యపేట)కు చెందిన జీవిబాబు బలగం సినిమాలో హీరో ప్రియదర్శి తాతగా.. కొమురయ్య తమ్ముడిగా అంజన్న పాత్రలో నటించాడు. జీవీ బాబు అసలు పేరు గుడిబోయిన బాబు. సుజాతతో వివాహమైంది. రంగస్థల వేదికపై 50పైగా నాటకాలు వేసి ప్రేక్షకులను మెపించారు. 20కి పైగా సినిమాలలో నటించారు. పౌరాణిక నాటక రంతోపాటు సినిమా రంగంలో వరంగల్‌కే మూల స్తంభంగా నిలిచారు.

జీవీబాబు భౌతికకాయానికి నివాళి..

జీవిబాబు మృతిపై బలగం డైరెక్టర్ యెల్దండి వేణుతోపాటు హీరో ప్రియదర్శి విచార వ్యక్తం చేశారు. రామన్నపేటలోని తన నివాసంలో జీవీబాబు భౌతికకాయాన్ని ఉంచగా.. నాటక సమఖ్య అధ్యక్షుడు ఆకుల సదానందం, రంగస్థలం కళాకారుల ఐక్యవేదిక బాధ్యులు కాజీపేట తిరుమలయ్య, ఎన్ఎస్ఆర్ మూర్తి, బలగం డైరెక్టర్ వేణు, హీరో ప్రియదర్శి, చిత్రం సభ్యులు బాలు కాయితి, ఆకునూరి దేవయ్య, బలగం కొమురమ్మ, భాస్కర్, నటుడు సుధాకర్, ఇతర నటీమణులు, రంగ స్థల కళాకారులు సందర్శించి నివాళులర్పించారు.